ప్రజాశక్తి
ఆదివారం 23 జూన్ 2024



విశాఖ కలెక్టర్ మల్లికార్జునపై బదిలీ వేటు

- అల్లూరి కలెక్టర్‌గా దినేష్ కుమార్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కలెక్టర్ల బదిలీల్లో భాగంగా శనివారం రాత్రి విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునపై బదిలీ వేటు పడింది. ఆయన హయాంలో వివిధ భూ కుంభకోణాలు బయటపడడం, గత ప్రభుత్వ పెద్దలు, ప్రముఖ ఉన్నతాధికారుల పేర్లు బయటకురావడంతో మల్లికార్జునకు ఎక్కడా ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు. జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే అల్లూరి జిల్లా కలెక్టర్‌గా దినేష్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ అక్కడ పనిచేసిన విజయసునీత బదిలీ అయ్యారు.

పాఠశాల భవనం నిర్మించాలని...

విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి: పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తక్షణమే ప్రభుత్వం భవనం నిర్మించి తమకు రక్షణ కల్పించాలని విద్యార్థులు వేడుకున్నారు. మోకాళ్ళపై విద్యార్థులు చేతులు జోడించి తమ ఆవేదనను వెలిబుచ్చారు. మండలంలోని వెంగడ పంచాయతీ పరిధి డొంకపుట్టు గ్రామ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఇదిలా ఉండగా పాఠశాల భవనం లేక రేకుల షెడ్డులో నాలుగు గ్రామాలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు విద్యా బోధనలు కొనసాగిస్తున్నారు. ఆ గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు రెండు దఫాలుగా నిధులు మంజూరైనప్పటికీ పనులు మధ్యలో వదిలి వేయడంతో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు వర్షాలకు పాఠశాల రేకుల షెడ్డులో వర్షపు నీరు ప్రవేశిస్తుంది. నేలపైన కూర్చో లేక ఇబ్బందులకు గురవుతన్నారు. గత వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకంతో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కోట్ల రూపాయలు నిధులు వెచ్చింది. కనీసం పాఠశాల భనం లేని చోట ఏర్పాటు చేసేందుకు ఎందుకు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, పలు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల భవనం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం స్పందించి నూతనంగా పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరసన చేపడుతున్న విద్యార్థులు

చింతూరు, రంపచోడవరం కేంద్రాల్లో

అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

రంపచోడవరం నియోజకవర్గంలోని ఐటిడిఎ కేంద్రాలైన చింతూరు, రంపచోడవరం కేంద్రాల్లో అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలకు అనేక పనుల నిమిత్తం ప్రజలు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు వస్తుంటారని, ఆ రెండు కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. విఆర్.పురం, ఎటపాక, కూనవరం, చింతూరు మండలాల నుంచి నిత్యం ప్రజలు వివిధ పన్నులపై చింతూరు, రంపచోడవరం వెళ్తున్న ప్రజలకు ఈ అన్న క్యాంటీన్ల ద్వారా కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. కావున తక్షణమే రంపచోడవరం, చింతూరు కేంద్రాలుగా ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్

గిన్నెలకోట పంచాయతీలో..

రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు

-రెండు రోజుల్లో రేషన్ సరఫరా చేయాలి - జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పెదబయలు: పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాలను కలుపుతూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ఆయా గ్రామస్తులు రహదారి కోసం సమర్పించిన ఫిర్యాదు నేపధ్యంలో శనివారం ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్థులతో పలు విషయాలు చర్చించారు. గ్రామస్తుల అభ్యర్ధన మేరకు చెక్ డ్యాం పరిశీలించి వెంటనే మరమ్మతుకు అంచనాలు తయారు చేయాలని, అదనపు చెక్ డ్యాం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచనలు జారీ చేసారు. గత నెలలో రేషన్ సరఫరా జరగలేదని, ఈ నెలలో కూడా ఇంతవరకు అందలేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ రెండు రోజుల్లో గ్రామస్తులకు రేషన్ సరఫరా చేసి నివేదిక సమర్పించాలని మండల తహసిల్దార్‌ను ఆదేశించారు. అనంతరం తమలం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, భోధనపై విధ్యార్ధులను ఆరా తీసారు. పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. చికిత్స పొందుతున్న బాలింతతో మాట్లాడి సకాలంలో మందులు వేసుకుంటూ డాక్టర్ల సూచనలు పాటించాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల రికార్డులు పరిశీలించిన కలెక్టర్ మందుల కొరత లేకుండా చూడాలని, వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని ఆదేశించారు.

జీపులో పర్యటించిన కలెక్టర్:

గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాల పర్యటనలో భాగంగా సరియాపల్లి నుండి తమలం వరకు సుమారు 3.50 కిలో మీటర్ల మేర రహదారి బాగు లేక కారు వెళ్ళ లేని పరిస్థితిలో కలెక్టర్ కారు దిగి ఒక ప్రైవేట్ జీపులో ప్రయాణించి తమలం చేరుకున్నారు. తమలంలో సన్నని రాళ్ళ బాటపై అతికష్టం మీద నడక సాగించి గ్రామానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో సరియాపల్లి చేరుకొని జాముగూడ వెళ్ళారు. కలెక్టర్ వెంట పిహెచ్‌సి వైద్యాధికారి సునీత, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇంచార్జ్ ఎంపిడిఓ పూర్ణయ్య, ఎఇ రాముడు, జాముగూడ సర్పంచ్ అచ్చయమ్మ ఉన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ఎంపిహెచ్ఇఓ సస్పెన్షన్

- ఫార్మాసిస్ట్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-పాడేరు: పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలకు రహదారి ఏర్పాటుపై శనివారం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆయా గ్రామాల్లో పర్యటించారు. పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఎంపిహెచ్ఇఓ వెంకటరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు. ఎంపిహెచ్ఇఓ మలేరియా సీజన్ ప్రారంభమైనప్పటికీ క్షేత్ర స్థాయి పర్యటనలు చేయకపోవడం, రికార్డులు నిర్వహించక పోవడంపై సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.ఫార్మసిస్ట్ పావని ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల వివరాలు స్టాక్ రిజిస్టర్ లో నమోదు చేయకపోవడం, స్టాక్ వచ్చిన విషయం కూడా తనకు తెలియకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రం వ్యక్త పరుస్తూ ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఎంహెచ్ఓ జమాల్ బాషాను కలెక్టర్ ఫోన్ లో ఆదేశించారు. గర్భిణీ స్త్రీ ముందుగానే ఆసుపత్రిలో జాయిన్ అయినప్పటికీ ప్రసవ సమయంలో డాక్టర్ హాజరు కాకుండా నర్స్ కు అప్పగించినట్లు తెలుసుకున్న కలెక్టర్ తీవ్ర ఆగ్రహంతో మందలించారు. ప్రసవ సమయంలో డాక్టర్ తప్పనిసరిగా హాజరు కావాలని, ఇటువంటివి పునరావృతం ఐతే తీవ్ర చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వైద్యాధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

అనంతబాబు అవినీతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-ఎటపాక

బినామీ పేర్లతో కోట్ల రూపాయలు దోచుకున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు) అవినీతిపై విచారణ జరపాలని ఎటపాక వైస్ ఎంపిపి దొంతు మంగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంత ఉదయ భాస్కర్ వైసిపి ప్రభుత్వ అధికారాన్ని అడ్డం పెట్టుకొని 2019 అడ్డగోలుగా నిబంధనలకు విరుధంగా తూర్పు గోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్‌గా నామినేట్ అయ్యారని ఆరోపించారు. అనంతబాబు డిసిసిబి చైర్మన్‌గా నామినేట్ అయిన తరువాత తనకు అనుకూలమైన అర్హత లేని వారిని, సెంటు భూమి లేని వారిని సహకార చట్టానికి విరుద్ధంగా మండల సహకార సంఘానికి అధ్యక్షులుగా నామినేట్ చేశారని తెలిపారు. ఆ సమయంలో మండల సొసైటీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ అనంతబాబు కోట్లలో అవినీతి చేశారని, ఎరువులు విత్తనాలతో పాటు ధాన్యం కొనుగోలులో అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ధాన్యం గోదాముల నిర్మాణం పేరుతో అసంపూర్ణ నిర్మాణాలు చేపట్టి బిల్లులు కాజేశారని, కనీసం సంబంధిత శాఖ నుండిగాని, స్థల యజమానుల నుండిగాని నో అబ్జెక్షన్ తీసుకోలేదంటే అనంతబాబు అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అందువల్ల అనంతబాబు అవినీతిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని, గతంలో ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేసి వారి స్థానంలో కొత్త కమిటీ ఏర్పడే వరకు ఇన్‌ఛార్జులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధిత విద్యార్థులకు

అదనపు మెనూ కల్పించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీ ప్రాంతం పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న అనేకమంది ఆదివాసీ విద్యార్థినీ, విద్యార్థులు సికిల్‌సెల్ ఎనీమియా అనే వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికీ అదనపు మెనూ, మందులు ప్రభుత్వమే అందించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నేటికీ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు పేదరికంలో ఉన్నారని, ఆర్థికంగా వెనుకబడడంతో వారి కుటుంబ పోషణ కష్టమవుతుందని పేర్కొన్నారు. తమ పిల్లలైనా చదువుకొని ఉన్నత స్థితికి వస్తారని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఒక పక్క పేదరికం, మరోపక్క ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సికిల్ సెల్ ఎనీమియా ఉన్న వారికి మందులు, బలమైన ఆహారం తీసుకునే ఆర్థిక స్తోమత లేదని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం ఆదివాసీ విద్యార్థిని విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మందులు, పౌష్టికాహారం అందించాలని కోరారు.

గిరిజన రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

గంగవరం మండలం, గంగవరం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, కొత్తాడ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు శనివారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాము అర్జున, మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభ, ఆముదాలబంధ ఎంపీటీసీ పండా ఆదినారాయణ దొర, గంగవరం సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి, కొత్తాడ సర్పంచ్ సారపు కామరాజుదొర, ఆముదాలబంద సర్పంచ్ అక్కమ్మ, టిడిపి నాయకులు కోసు బుల్లియమ్మ, సారపు సత్యవేణి, కుంజం కృష్ణమూర్తి దొర, కుంజం వెంకటేశ్వర్లు దొర, మడకం రామారావు దొర, కోసు తమ్మన్నదొర, కారం ప్రసాద్ దొర, కారం రాజ్ కుమార్ దొర, కలుముల వెంకన్న దొర, కుంజం వెంకన్న దొర, సవలం చెల్లన్నదొర, బొట్టా కృష్ణ, స్వర్ణ, పామర్తి వీరబాబు, సింహాద్రి రాంబాబు, బండి చిన్న వెంకటరమణ దొర, కమ్మరి రాంబాబు, ఎంఇఒ, విఎస్ఎ రెహానా సుల్తాన్, వీఎఎ గ్రేస్, కొత్తాడ సెక్రెటరీ అజయ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-జి.మాడుగుల: ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి నాణ్యమైన విద్యను అందించాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశించారు. శనివారం నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు, బొయితిలి బాలురు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఎంత మంది పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చర్మ వ్యాదులతో బాధపడుతున్నారని గుర్తించి, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌తో మాట్లాడి తగిన వైద్యం అందించాలని ఆదేశించారు. చర్మ వ్యాదులు రాకుండా పరిశుభ్రంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. వేడి నీటితో బట్టలు ఉతకాలన్నారు. గ్రామంలో తలిదండ్రులు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలో చూసిరాతలకు అలవాటు పడకూడదని తెలిపారు. టెన్త్ తరువాత ఏమి చదువుతారని విద్యార్థులను ప్రశించారు. అనంతరం 10 వతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠాలు బోధించి పాఠ్యాంశంలోని ప్రశ్నలు వేసి జవాబులు అడిగి తెలుసుకున్నారు.. ప్రతీ విద్యార్ధి పాఠశాలకు హజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలకు తీసుకుని రావాలని, ఇందుకు మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకోవాలన్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి

ఎఎస్‌పి ధీరజ్ పర్యటన

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక పోలీస్ స్టేషన్, నుర్మతి అవుట్ పోస్ట్‌ను పాడేరు ఏఎస్‌పి ధీరజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ రమేష్‌తో మాట్లాడుతూ, నాటు సారా, గంజాయిపై పూర్తిగా నిఘా పెట్టాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై, శ్రీనివాస్, సిఆర్‌పిఎఫ్ 198 బెటాలియన్ ఇన్స్పెక్టర్ రవి ఉన్నారు.

గొందిగూడెం పాఠశాలకు

నూతన భవనం మంజూరు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధి గొందిగూడెం గ్రామంలోని పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. గొందిగూడెం గ్రామాన్ని సిపిఎం మండల నాయకులు శనివారం సందర్శించారు. గ్రామంలోని ప్రధాన సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామ పెద్దలు, యువత, సిపిఎం మండల నాయకులు గ్రామాన్ని, శిథిలమైన పాఠశాల భవనాన్ని సందర్శించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సురేష్ మాట్లాడుతూ పాఠశాల భవనం స్లాబ్ పూర్తిగా ధ్వంసమై తరగతులు నిర్వహించడానికి వీల్లేకుండా ఉండడంతో కొత్త పాఠశాల భవనం మంజూరు చేయాలని అనేకసార్లు వినతులు ఇచ్చిన ఏ ఒక్కరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఓ స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో రేకుల షెడ్డు నిర్మించి పాఠశాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పాఠశాలలు అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పిందని, గొందిగూడెంలో పాఠశాల భవనం శిథిలమైనా నూతన భవనం మంజూరు చేయకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసిందని విమర్శించారు. నూతన ప్రభుత్వమైనా శిథిలావస్థ ఉన్న గొందిగూడెం లాంటి పాఠశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలని కోరారు. మంచినీటి వసతిని మెరుగుపరచాలని, ట్యాంకు వద్ద మంచినీటి వృథాను అరికట్టాలని, గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, దూబీ లక్ష్మయ్య, దూవి రమేష్, రాంబాబు, లేలే రామారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థ నిర్మించిన రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి-సీలేరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి గిరిజనులకు సూచించారు. జీకే.వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ గొర్రెలోవ కొమ్మలవాడలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ మస్తాన్‌వల్లి మాట్లాడుతూ ఊటనీరు, కలుషిత నీరు తాగొద్దని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ బాలామణి, సచివాలయ ఏఎన్ఎం అరుణ కుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, మహిళా పోలీస్ ఈశ్వరి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి



బోల్తా పడిన పెట్రోల్ ట్యాంకర్ ఇదే..

ఘాట్ రోడ్డులో పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ సప్పర్ల - రైన్ గేజ్ ఘాట్ రోడ్డు మధ్యలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ వి.శివకుమార్‌కు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... విశాఖపట్నం నుంచి సీలేరు పెట్రోలు బంకుకు శనివారం తెల్లవారుజామున పెట్రోల్ తీసుకొచ్చి అన్లోడ్ చేశారు. తరువాత విశాఖపట్నం తిరుగు ప్రయాణంలో సప్పర్ల రైన్ గేజ్ ఘాట్ రోడ్లో మధ్యలో ప్రమాదవస్తు పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను వెంటనే సప్పర్ల పిహెచ్సికి తరలించి వైద్య సేవలు అందించారు. ఘటన చోటు చేసుకున్న ప్రదేశంలో పెద్ద లోయ ఉంటే డ్రైవర్ మృత్యువాత పడేవారని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు:ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం పాడేరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం పాడేరులో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులుగా: కుంట్యాడ సన్యాసిరావు, ఉపాధ్యక్షులుగా బేరా సరస్వతి, అంబిరి చిట్టిబాబు, కూడా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా సుర్ర అప్పారావు సహాయ కార్యదర్శి: కూడా సన్నీ బాబు, సహాయ కార్యదర్శి గా: దిసరి సత్య రావు, సహాయ కార్యదర్శి: కిల్లో రామచందర్, కోశాధికారిగా కొర్ర కామరాజు, కమిటీ సభ్యులుగా ఎస్.కన్నబాబు, అంబిరి వెంకట ప్రసాద్ సుభద్ర జయప్రియ, జె.వెంకట్రావు, ఎం.ఈశ్వరి, కొండమ్మ నియమితులయ్యారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ పుప్పల అప్పలరాజు ఓ ప్రకటనలో కోరారు. మాడుగుల టౌన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరిపోక పోవడంతో వోల్టేజ్, హై ఓల్టేజ్ లతో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం హెచ్చుతగ్గులతో కూడిన కరెంటు సరఫరాతో ఇటీవల మాడుగుల్లోని గణేష్ కాలనీలో టీవీలు, ఫ్యాన్లు, ట్యూబ్లైట్లు ఎక్కువగా కాలి పోయాయన్నారు. మాడుగుల టౌన్‌లో 6 నుండి 8 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అర్బన్ కాలనీ, గణేష్ కాలనీ, నూకాలమ్మ కాలనీలో ఈ సమస్య ఎక్కువగా ఉందని విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరారు.

మాడుగుల టౌన్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం దష్ట్యా వచ్చిన ఫిర్యాదుల మేరకు తప్పనిసరిగా తగిన రీతిలో సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పలనాయుడు తెలిపారు.ఈ మేరకు ఆయన ఆయా ప్రాంతంలో ఉన్న ట్రాన్ఫార్మర్స్ వద్ద ట్రాన్సిస్టర్ రీడింగ్స్ పరిశీలన చేశారు. అవసరమైన అదనపు ట్రాన్ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. వర్షాలకు ఉరుములు, మెరుపులతో విద్యుత్ హెచ్చు తగ్గులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, న్యూటల్ ఎర్త్ ఉన్నట్లయితే నష్టం జరిగే ప్రమాదం తగ్గుతుందని సూచించారు.

28న గురుకుల రాత పరీక్ష

ప్రిన్సిపల్ సువర్ణ రత్నకుమారి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో (బాలికలు) 2024- 2025 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 9 వ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి ఈనెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే.సువర్ణ రత్నకుమారి శనివారం వెల్లడించారు. 6,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 22వ తేదీ నుంచి 26 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు ఫారం నకు ఆధార్, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. నక్కపల్లి గురుకులంలో ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందు (9 గంటలకు) హాజరు కావాలని, తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకుని రావాలని ప్రిన్సిపల్ సువర్ణ రత్నకుమారి తెలిపారు.

ఎంపీ సిఎం రమేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:అనకాపల్లి కూటమి ఎంపీ సీఎం రమేష్‌కు స్థానిక నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో సీఎం రమేష్‌ను బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు, నాయకులు దేవవరపు లోవరాజు, నడిగట్ల అప్పన్న తదితరులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపి నేతల సంబరాలు

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం శాసనసభ్యులైన చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా మండలంలోని జోగంపేట జంక్షన్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అడిగర్లప్ప నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేశారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ నాయకులైన అయ్యన్నకు అరుదైన గౌరవం దక్కిందన్నారు. స్పీకర్ పదవి ఆయనకు కేటాయించడం తో పార్టీలో ఆయన ప్రాముఖ్యతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంమూర్తి, సుర్ల బాబ్జి, పారేపల్లి నాగేశ్వరరావు, కొమర వోలు చిట్టిబాబు,పుల్లేటికుర్తి రమేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి


జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావనా విశిష్ట్

ప్రజాశక్తి-పాడేరు: అర్హులైన లబ్దిదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులు, జిసిసి డివిజనల్ మేనేజర్లు, ఎంఎల్ఎస్. పాయింట్ ఇన్చార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ నెలా 30వ తేదీ నాటికి నిత్యావసర సరుకులు సంబంధిత స్టాక్ పాయింట్లకు చేరవేయాలని సూచించారు. బియ్యం నిల్వలలో చీడ పీడలు లేకుండా కార్డుదారులకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని స్పష్టం చేసారు. ఎం.ఎల్.ఎస్ పాయింట్లను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్యాక్ చేసిన వస్తువుల బరువుల ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి తగిన యంత్ర పరికరాలను కొనుగోలు చేయాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.సరుకులు నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. లబ్దిదారులకు సరుకులు పంపిణీలో తూకం సక్రమంగా ఉండాలన్నారు. పంపిణీ చేసిన సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిపిఎస్ సిస్టం ఉన్న వాహనాలలో సరుకులు రవాణా చేయాలని చెప్పారు.నిత్యావసర సరుకులు పంపిణీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సి. శ్రీహరి, డిఎం గణేష్, జిసిసి డిఎంలు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్చార్జీలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు పెంచాలి

పిఒకు ఎస్ఎఫ్ఐ వినతి


ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీ ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, జీవన్ కృష్ణ శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ 11 మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 6,7,8 తరగతులలో అడ్మిషన్లు లేవని హెచ్ఎంలు వెనక్కి పంపిస్తున్నారన్నారు.అడ్మిషన్ల కోసం పాఠశాల లకు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుకోవాలని ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించకుంటే ఐటీడీఏ గేటు వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంతటి ఉద్యమానికైనా వెనకాడమని హెచ్చరించారు. ప్రతి గిరిజన పేద విద్యార్థులకు చదువుకునే హక్కును కల్పించాలన్నారు.ఈ విషయమే పిఒ స్పందించి విద్యార్థులను ప్రతి క్లాసులో హెచ్ఎంలు జాయినింగ్ చేసుకోమని తెలియజేస్తామని చెప్పారన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

డుంబ్రిగుడ:గిరిజన విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని గసభ పంచాయితీ సిపిఎం సర్పంచ్ పి.సునీత చెప్పారు. మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో 6,7వ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను శనివారం సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని చెప్పారు. చదువుతో పాటుగా, క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, వార్డుమెంబర్‌లు పి సత్యనారాయణ, పి.రాజ్ కుమార్, పాఠశాల చైర్మన్ పి దొరబాబు, ఉపాధ్యాయులు విశ్వనాథరాజు, పౌలు, గురుమూర్తి పాల్గొన్నారు.

జి.మాడుగుల:మండలంలోని నుర్మతి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక సర్పంచ్ తల్లే సూరిబాబు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందచేశారు. ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు అంబిడి శ్యామసుందరం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వనబంగి మత్స్య కొండబాబు, ఎంపీటీసీ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీత

గ్రావెల్ తరలింపుపై కేసులు నమోదు చేయాలి

తహశీల్దార్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలో అక్రమంగా గ్రావెల్ తరలించిన వారిపై ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని అరగలమెట్ట సాగుదారులు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రావెల్ సామాన్యులు తరలిస్తే కేసులు నమోదు చేసి జరీమానాల విధిస్తారని తెలిపారు. లేఔట్ యజమాని గ్రావెల్ తరలిస్తే ఎందుకు కేసులు పెట్టలేదని, జరిమానాలు ఎందుకు విధించ లేదని స్థానిక రైతులు ప్రశ్నించారు. ఈ విషయంపై శనివారం స్థానిక తహసిల్దార్ వద్ద విలేకరులు ప్రస్తావించగా రెండవ సారి నోటీసులు జారీ చేశామన్నారు. ఇందుకు సబంధించిన వివరాలు.. చీడికాడ మండల కేంద్రం రెవెన్యూ సర్వే నెంబర్ 119, 120లలో జిరాయితి భూమిని విశాఖకు చెందిన ఓ కార్పొరేటర్ కొనుగోలు చేశారు. ఆ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేశారు. లే అవుట్లు వేసేందుకు రహదారులు నిర్మించినందుకు గాను ఆ పక్కనే గల అరగలమెట్టను తవ్వి మెట్టకు సంబంధించిన గ్రావెల్‌ను తరలించి రహదారులను నిర్మించుకున్నారు. ఈ లేఔట్ లపై ఇప్పటికే స్థానిక పాత్రికేయులు కథనాలు ప్రచురితం చేయడమే కాకుండా అక్రమ గ్రావెల్ తరలింపు పై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు లేఅవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ లేఅవుట్ల యజమానులు స్పందించక పోవడంతో రెండోసారి నోటీసులు జారీ చేయడమే కాకుండా ఎనిమిది లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు, అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులతో సర్వే చేయిస్తామని శనివారం స్థానిక కార్యాలయంలో తహసిల్దార్ ప్రకాష్‌రావు విలేకరులకు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా అక్రమ గ్రావెల్ ను తరలిస్తుండగా.. సాక్షాలు ఎదురుగా కనిపించినప్పుడు తరలింపు చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి ఈ అక్రమ తరలింపు వారిపై చర్యలు తీసుకోవాలని అరగల మెట్ట ప్రాంతీయులు కోరుతున్నారు.

రోడ్డు నాణ్యతపై శాంపిల్స్ సేకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఎన్నికల ముందు నిర్మించిన రోడ్డు పై శనివారం ఆర్ అండ్ బి క్వాలిటీ కంట్రోల్ అధికారులు శాంపిల్స్ సేకరించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ సత్యభాస్కర్ ఆధ్వర్యంలో నర్సీపట్నం -కేడీపేట ఆర్ అండ్‌బి రోడ్డుపై ఆరిలోవ ప్రాంతంలో నిర్మించిన మూడున్నర కిలోమీటర్ల రోడ్డు భాగంలో ఈ శాంపిల్స్ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సత్య భాస్కర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఈ నాగమోహన్, క్వాలిటీ కంట్రోల్ జేఈ లు శ్రీనివాసరెడ్డి, రాము, ధనప్రియ, కేడీపేట సెక్షన్ జేఈ డీజీపీ ప్రసాద్ లు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి రమణమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి -కొత్తకోట:ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన రావికమతం జడ్పిటిసి తలారి రమణమ్మకు పలువురు ఘనంగా నివాళి అర్పించారు. రావికమతం మండలంలోని కొత్తకోటలోని స్వగృహం వద్ద ఆమె చిత్ర పటానికి శనివారం నివాళి అర్పించి సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బుచ్చయ్యపేట మండలం జెడ్‌పిటిసి దొండా రాంబాబు, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్, రావికమతం ఎంపిపి పైల రాజు, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, కొత్తకోట సర్పంచ్ కొన లోవరాజు, జిల్లాలో వివిధ మండలాలకు చెందిన జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచ్, ఎంపిటిసిలు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేత

ప్రజాశక్తి -కోటవురట్ల:అంజన్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలలో పలువురు ఉత్తమ విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహక నగదును అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా స్థానిక తహసిల్దారు వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంజన్ కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ లో భాగంగా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ఎంపిక చేసి ఆర్థిక సహాయం తహసిల్దార్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి భాను, ప్రమీల పాల్గొన్నారు.


పుస్తకాలు, యూనిఫారాలు అందుకున్న విద్యార్థులు

పుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ

ప్రజాశక్తి-ఎటపాక : మండల కేంద్రం ఎటపాక ప్రాథమిక పాఠశాలలో స్కూల్ చైర్మన్ డేగల మాధవరావు ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపించిన పుస్తకాలను, యూనిఫామ్లను విద్యార్థులకు ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్లు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

విశాఖ సహకార బ్యాంకు వ్యాపార లక్ష్యం రూ.8 వేల కోట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వ్యాపార లక్ష్యాన్ని రూ.8 వేలు కోట్లుగా నిర్ణయించామని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ద్వారకానగర్ ఐదో లైనులోగల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.7,350 కోట్ల మైలురాయిని అధిగమించి తాజా లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. 2023-24 నాటికి 1,04,865 మంది సభ్యులు, రూ. 352.61 కోట్లు షేరుధనంతో భారతదేశంలోనే అతి పెద్ద సహకార అర్బన్ బ్యాంకులలో ఒకటిగా స్థానం సంపాదించుకుందన్నారు. దేశంలోని నాన్ షెడ్యూల్డ్ సహకార బ్యాంక్‌లలో అతి పెద్ద బ్యాంక్‌గా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ నిలిచి సహకార సూత్రాలను త్రికరణ శుద్ధిగా పాటించడంలో తన ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. బ్యాంక్ సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత జీవిత బీమా వుందన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించిన రుణ గ్రహీతలకు 4 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో 2596 మందికి రూ.5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. 108 వ వార్షిక మహా జనసభ నిర్ణయం మేరకు రూ. 33.56 కోట్లను సభ్యులకు వారి షేరు ధనంపై డివిడెండ్ గా బ్యాంకు చెల్లించిందన్నారు. ఈ ఏడాది కొత్తగా ఐదు బ్రాంచిలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ నెల 20న షీలానగర్‌లో 51వ బ్రాంచి ఏర్పాటు చేశామని తెలిపారు. చిత్తూరు, బాపట్ల, నరసరావుపేట, తాడేపల్లిగూడెంలలో బ్రాంచిలు ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది కాలంలో కోటికిపైగా డిజిటల్ కార్యకలాపాలు ద్వారా రూ.5714 కోట్లు టర్నోవర్ జరిగిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.87.79 కోట్ల లాభం సాధించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో డైరెక్టర్లు మానం ఆంజనేయులు, జెవి.సత్యనారాయణ మూర్తి, ఎజె స్టాలిన్, ఉప్పలపాటి పార్వతి దేవి, సిఎ వీరఘంట చంద్రశేఖర్, కామరాజు, జనార్ధనరావు, చెరువు ఆదినారాయణ శాస్త్రి, రమణారావు, కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణారావు, సిఇఒ పివి.నరసింహమూర్తి పాల్గొన్నారు.



రాజకీయ కట్టడికేనా..?

- అయ్యన్నను స్పీకర్‌గా పంపడంపై సర్వత్రా చర్చ
- బాబు, లోకేష్ వ్యూహమేనని వ్యాఖ్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టారు. 1983లో తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రవేశం చేసిన ఆయన ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి అనకాపల్లి ఎంపీగా విజయం సాధించారు. ఐదు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. తన అభిప్రాయాలను ఏ మాత్రం దాచుకోకుండా విలక్షణంగా చెప్పే లక్షణం కలిగిన ఆయన్ని శాసనసభాపతిగా పంపడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. రాజకీయంగా కట్టడి చేయడానికే అన్న వారూ లేకపోలేదు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నుంచి కె.ప్రతిభాభారతి, తమ్మినేని సీతారాం శాసనసభాపతులుగా పనిచేశారు. తాజాగా ఈ ప్రభుత్వంలో అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా ఎన్నికయ్యారు. సభాపతి స్థానం గౌరవప్రదమైనదైనా, ప్రత్యక్ష రాజకీయాలకు దూరం పాటించాల్సివుండడంతో రాజకీయ భవిష్యత్తుకు సవాలుగా మారనుంది. సభాపతిగా పనిచేసిన వీరెవరూ తరువాత ఎన్నికల్లో గెలవలేదు. ప్రత్యక్ష రాజకీయాలకు అయ్యన్నను దూరంగా ఉంచాలన్న టిడిపి అధినేత చంద్రబాబు వ్యూహంలో భాగంగానే పార్టీలో సీనియర్ నాయకుడైన ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదన్న చర్చ కూడా కొద్దికాలంగా నడుస్తోంది.

మంత్రి పదవి ఇవ్వకపోయినా చంద్రబాబు మనసెరిగిన అయ్యన్న గతంలో చూపిన కోపం ప్రదర్శించకుండా ఈసారి సర్దుకుపోయారు. మంత్రులుగా కొత్త వారికి అవకాశమివ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు మాట్లాడారు. భవిష్యత్తులో టిడిపి కళ్లెం లోకేష్ చేతిలో పెట్టాలన్న ఆలోచనతో తమ మాట జవదాటని వారిని ఏరుకొని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారు. అందుకని సీనియర్లుగా వున్నవారిని పక్కన బెట్టి కొత్త వారికి, తన విధేయులకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. అయ్యన్నకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై పార్టీలోనూ చర్చ సాగడంతో అనూహ్యంగా అయ్యన్నను సభాపతిగా తెరమీదకుతెచ్చారు. ప్రత్యక్ష రాజకీయాలకు అయ్యన్నను దూరంగా వుంచాలన్న బాబు ఆలోచనలో భాగంగానే స్పీకర్ స్థానంలో కూర్చొబెట్టి, అయ్యన్న సీనియార్టీకి గౌరవమిచ్చినట్లు చేయగలిగారు. పార్టీలో చంద్రబాబు నిర్ణయాలతో ఏకీభవించలేనప్పుడు అంతర్గతంగానూ, కొన్ని సందర్భాల్లో బహిరంగంగానూ అయ్యన్న తన అభిప్రాయాలు చెప్పడం బాబుకు ఇబ్బందిగా వుంది. రాజకీయంగా అయ్యన్నను బలహీనపర్చేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడలో అనకాపల్లి ఎంపీ టికెట్‌ను అయ్యన్న తనయుడు విజయ్‌కు ఇవ్వకపోవడం, నర్సీపట్నం ఎమ్మెల్యే టికెట్‌ను కూడా విజయ్‌కు ఇవ్వడానికి నిరాకరించడం వంటి పరిణామాలు అంతర్లీనంగా చోటుచేసుకున్నాయి. మాడుగుల నియోజకవర్గంలో జరిగిన చంద్రబాబు సభలో తన తనయుడు విజయ్‌కు ఎంపీ టికెట్ ఇస్తే తనను ఆదరించినట్లు విజయ్‌నూ అభిమానించాలని అయ్యన్న కోరారు. ఇది చంద్రబాబుకు నచ్చలేదు. లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో స్థానికేతరుల ఫ్లెక్సీలు పెట్టడంపై అయ్యన్న తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇవన్నీ చంద్రబాబు, లోకేష్ మనసులో మెదలడంతో అవకాశం వచ్చినప్పుడు హుందాగా తప్పించాలన్న ప్రయత్నంలో అనేక తర్జనభర్జనల మధ్య శాసన సభాపతిగా అయ్యన్నను ముందుకు తెచ్చినట్టు తెలుస్తోంది.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాహాలు, వేసవి కాలం నేపథ్యంలో విభిన్న రూపాల్లో, వినూత్న వస్త్రాలతో 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్' గ్రీన్ పార్క్ హోటల్‌లో శనివారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు సాగే ఈ ఎక్స్‌పోలో దేశంలోని అనేక ప్రాంతాల విభిన్న సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే ఉత్పత్తులను ప్రదర్శించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపుతో వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైన వాటిని ఒకేచోట అమ్మకాలకు అందుబాటులో ఉంచారు. మహారాష్ట్రకు చెందిన సొగసైన పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ చందేరి, మహేశ్వరి సిల్క్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ సిల్క్, లినెన్ శారీ కాంతా వర్క్ చీరలు వగైరా ఒకే చోట కొలువుదీరాయి. దుప్పట్లు, సల్వార్ మెటీరియల్‌లు కూడా ఇక్కడ ఉన్నాయి. బీహార్‌కు చెందిన టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్, గుజరాత్‌కి చెందిన సాంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడుకు చెందిన కాంజీవరం, ఎంబ్రాయిడరీ సిల్క్‌తో పాటు జమ్మూ, తావి కాశ్మీర్ సిల్క్ చీరలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. బెనారస్ పట్టు చీరలు, జమదాని సిఫాన్ చీరలు, ఉత్తరప్రదేశ్ లక్నో చికాన్ వర్క్, రాజస్థాన్ బంధిని, బంధేజ్ ,హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు కూడా ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలో ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎక్స్‌పో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


ఎక్స్‌పోలో చీరను ప్రదర్శిస్తున్న మహిళ


సీలేరులో కురుస్తున్న వర్షం

వర్షంతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్ల బడి జనం ఉపశమనం పొందారు. గతంలో జూన్ నెల ప్రారంభం నుంచి విస్తీరంగా వర్షాలు కురిసేవి. ఈ ఏడాది రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినా చినుక జాడ లేదు. మరో వైపు భానుడి ప్రతాపంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శనివారం కూడా సీలేరులో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో సాయంత్రం ఒక మాదిరిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఖాన్‌కు ఎమర్జింగ్ ఎడ్యుకేషన్ హీరో అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురుస్థానం స్కూల్ యాజమాన్యం ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకుంది. శనివారం ఉదయం గీతం యూనివర్సిటీలో శివాజీ ఆడిటోరియంలో ఎడ్యుకేషన్ గ్రోత్ నెట్‌వర్క్ నిర్వహించిన అవార్డు ఫంక్షన్‌లో గురుస్థానం స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ 'ఎమర్జింగ్ ఎడ్యుకేషన్ హీరో'గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తమ ఉనికిని, నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న ఈజీయన్ గ్రూప్ నుంచి ఇటువంటి ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గీతం యూనివర్సిటీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిర్మల్‌రావు, గురుస్థానం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా పాల్గొన్నారు.



అవార్డుతో గురుస్థానం స్కూల్ డైరెక్టర్ ఖాన్

మత్స్య సంపద నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్య సంపద విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంపై ఎంపెడ అనుబంధ సంస్థ నెట్ ఫిష్ ఆధ్వర్యంలో శనివారం ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నెట్ ఫిష్ తూర్పు తీర రాష్ట్రాల కో-ఆర్డినేటర్ హనుమంతరావు సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మత్స్య ఉత్పత్తులను పరిశుభ్ర వాతావరణంలో అమ్మడం, నాణ్యమైన పద్ధతుల్లో మార్కెటింగ్ చేయడంపై మత్స్యకార మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్, ప్రధాన కార్యదర్శి మైదుపల్లి లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ పీరుపల్లి ధన తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో నెట్ ఫిష్ ద్వారా మహిళలు మార్కెట్ చేసుకోవడానికి ఉపయోగపడే రెగ్జిన్ సీట్లను హనుమంతరావు మహిళలకు అందజేశారు.

విస్తృతంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం తనిఖీ లు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం కోరాపుట్-కొత్తవలస సెక్షన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, కార్యాచరణ సామర్థ్యం, ప్రయాణికుల సౌకర్యాల వంటి పలు అంశాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్బంజన్ రాయ్ ఉన్నారు.